పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం



పాన్‌గల్ సమ్మె శిబిరంలో భోజనాలు చేస్తున్న పంచాయతీ కార్మికులు

- సమ్మెలో పంచాయతీ కార్మికులు
- అపరిశుభ్రంగా పల్లెలు
- 15వ రోజుకు చేరిన దీక్షలు



పాన్‌గల్‌లో డ్రెయినేజీలో పేరుకపోయిన చెత్త

పాన్‌గల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన, అంతర్గత రోడ్లు చెత్తతో నిండిపోయాయి. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ కార్మికులది ప్రధాన పాత్ర. ప్రతి ఇంటి తలుపు తడుతూ వ్యర్థాలను శివారుకు చేర్చడంలో వీరి పాత్ర కీలకం. తమ సమస్యలు తీర్చాలంటూ వారు ఈ నెల 6 నుంచి సమ్మెకు దిగారు. దీంతో డ్రెయినేజీల్లో పూడిక తీసే పారలు మూలకు చేరాయి. ట్రాక్టర్లు కదలడం లేదు. ఫలితంగా పల్లెలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.

మండలంలో పరిస్థితి

మండలంలోని 28 పంచాయతీల్లో 130 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరి సేవలను గుర్తించిన ప్రభుత్వం రూ. 3 వేల వేతనాన్ని రూ.8,500కు పెంచింది. వీరిని మల్టీపర్పస్ సిబ్బందిగా మార్చారు. రెండు నెలల క్రితం వీరికి మరో రూ.వెయ్యి అదనంగా పెంచి రూ.9,500 ఇస్తోంది. పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు తల్తెత్తకుండా బ్లీచింగ్, పాగింగ్ చేస్తుంటారు. కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు వెలకట్టలేనివి. నిత్యం ప్రమాదకర పరిస్థితుల్లో పని చేసే వీరి రక్షణకు అవసరమైన సామగ్రి పంపిణీలో కొంత జాప్యం జరుగుతోంది. జాతీయ స్థాయిలో పల్లెలు ఉత్తమ ర్యాంకులు సాధించడంలో వీరి సేవలు కీలకం. గ్రామ పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లు రూ.19,500 చెల్లించాలి. జీఓ నెం.51ని రద్దు చేసి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అప్రమత్తత అవసరం

వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పంచాయతీ కార్మికుల అవసరం ఎంతో ఉంటుంది. డ్రెయినేజీలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ తదితర కార్యక్రమాలను తప్పనిసరిగా చేయాల్సి ఉంది. లేదంటే దోమలు వృద్ధి చెంది ప్రజలు అంటువ్యాధులు, జ్వరాల బారిన పడే అవకాశం ఉంది. ఈ సమయంలో కార్మికులు సమ్మె చేపడుతుండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసి తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదముంది. దీనికనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కార్మికుల వివరాలు ఇలా..

మండలం	జీపీలు	కార్మికులు
పాన్‌గల్	28	130 మంది
చిన్నంబావి	17	70 మంది
వీపనగండ్ల	14	64 మంది

సమస్యలు పరిష్కరించే వరకు..



కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం. ఇప్పటికే ముందస్తుగా పలుమార్లు ఉన్నతాధికారులకు తమ సమస్యలపై విన్నవించాం. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చాం. ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 10 లక్షల నష్టపరిహారం, తక్షణ సాయంగా రూ. 30 వేలు చెల్లించాలి.

– రాము, సీఐటీయూ జిల్లా నాయకుడు

వేతనం సరిపోవడం లేదు



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.9,500 వేతనం సరిపోవడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన చెల్లింపులో మార్పులు చేయాలి. రూ.19 వేలను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలి. ఆదివారం సెలవు ఇవ్వడంతో పాటు ఉన్నతాధికారుల వేధింపులు అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– అర్జునయ్య, పారిశుద్ధ్య కార్మికుడు, పాన్‌గల్

కార్యదర్శులకు సూచనలు చేశాం



పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికులు సమ్మె చేస్తుండటంతో ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించాం. ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులకు ప్రత్యామ్నాయంపై సూచనలు చేశాం. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. పారిశుద్ధ్య పనుల్లో డ్రెయినేజీల శుభ్రం చేసే పనుల్లో మాత్రమే ఇబ్బందులు ఉన్నాయి.

– నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ, పాన్‌గల్

తీరనున్న విద్యుత్ సమస్య

- నేడు మానాజీపేట సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్న మంత్రి నిరంజన్‌రెడ్డి
- మూడు గ్రామాల ప్రజలకు ప్రయోజనం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా సబ్‌స్టేషన్

ఖిల్లాఘనపురం: విద్యుత్ సమస్యలతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజల సమస్యలు తీరనున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా విద్యుత్ నిలిచిపోవడంతో చీకట్లో అవస్థలు పడుతున్న ప్రజలకు, మోటార్లు నడవక ఇబ్బందులు పడే అన్నదాతల కష్టాలకు మోక్షం లభించనుంది. మూడేళ్ల క్రితం మానాజీపేటలో భూమిపూజ చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ కొండయ్య తెలిపారు. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మానాజీపేటకు చేరుకుని గ్రామంలో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్, రజక కమ్యూనిటీ హాల్, పశువైద్యశాలలకు భూమిపూజ చేయడంతో పాటు సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

సబ్‌స్టేషన్ ఉపయోగంలోకి వస్తే మానాజీపేట, మల్కాపురం, గట్టుకాడిపల్లి గ్రామాల ప్రజలకు మేలు కలగనుంది. ఆయా గ్రామాల్లో సుమారుగా 3,600 వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్ అందనుంది. మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సబ్‌స్టేషన్ మంజూరు చేయడంతో పాటుగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసించొద్దు



అమరచింతలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అమరచింత: కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరిన ఇళ్లతో పాటు మట్టి మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉందని, వాటిలో ఎవరూ నివసించొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా కోరారు. కలెక్టర్ ఆదేశాలతో గురువారం మున్సిపల్ సిబ్బందితో పట్టణంలోని పది వార్డుల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్ల వివరాలపై సర్వే చేయించారు. మట్టి మిద్దెలలో నివసిస్తున్న కుటుంబాలను పరామర్శించి, ప్రత్యామ్నాయ గృహాల్లోకి వెళ్లాలని సూచించారు. రాత్రివేళలో వర్షాల తాకిడికి మట్టి మిద్దెలు తడిసి కూలిపోతున్నాయని, దీంతో ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది బాలగోపాల్, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలో కురుస్తున్న ముసురు వర్షాల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పాండునాయక్ కోరారు. గ్రామాల్లో మట్టి మిద్దెల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ముసురు వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఏర్పడ్డ సంబంధిత అధికారులకు, వైద్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులు, ముసురు వర్షాలతో కలిగే ప్రమాదాన్ని ప్రజలకు తెలియజేస్తూ విద్యుత్ సరఫరా అవుతున్న స్తంభాల వద్దకు చిన్నారులు వెళ్లకుండా చూడాలని ఆయన కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తకోట రూరల్: మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పాటు వాతావరణ శాఖ సూచన మేరకు మరో 48గంటలు ఇదే పరిస్థితి కొనసాగనుండడంతో పెద్దమందడి మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దమందడి ఎస్ఐ హరిప్రసాద్ సూచించారు. పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థకు చేరిన నివాసాల్లో నివసించే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా కరెంట్ స్తంభాల దగ్గర ఉండకూడదని, చేపలు పట్టేవారు వాగుల్లోకి వెళ్లకూడదన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట, ఛత్రపతి శివాజీ విగ్రహం పక్కన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుతో గౌడ్‌ల కీర్తి మరింత పెంచినట్లు అవుతుందని, ఆయన పోరాట స్ఫూర్తిని యువతరలో సజీవంగా నిలిచేలా చేయొచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ నాగన్నయాదవ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి



ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌లో..

కొత్తకోట: బీజేపీ అధిష్టానం ఆదేశానుసారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం పోరుబాట కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులను గురువారం తెల్లవారుజామున ఎస్ఐ మంజూనాథ్‌రెడ్డి ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన ఇళ్లలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉందని, ఇళ్లను తనిఖీలు చేసేందుకు వెళ్తున్న తమను ముందస్తు అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాల గొంతు నొక్కడం సరికాదన్నారు. అరెస్టయిన వారిలో భరత్‌భూషణ్, నవీన్‌రెడ్డి, కొమ్ము సురేష్ తదితరులు ఉన్నారు.

మదనాపురం: బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు డబుల్ బెడ్‌రూంలో పోరుబాట కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, కో కన్వీనర్ కరికె నితిన్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజ్, శ్రీనివాస్‌గౌడ్, గొనికాడి శివకుమార్ యాదవ్, బాలచంద్రి తదితరులు ఉన్నారు.

అమరచింత: బీఆర్ఎస్ పాలనలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నించడమే నేరంగా మారిందని, అవినీతిని నిరూపిస్తామనే వారిని నిర్బంధ అరెస్టులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూంలలో జరిగిన అవినీతితో బయటపెట్టేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాకేష్‌శెట్టి, శ్రీనివాస్‌యాదవ్, మేస్త్రీ శ్రీను తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని పలువురు బీజేపీ నాయకులను గురువారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడు, బీసీ సెల్ నాయకుడు ఆశన్న, అంజనేయులు, శివశంకర్ ఉన్నారు. తరువాత వ్యక్తిగత పూచీకత్తుపై వారిని వదిలేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

వీపనగండ్ల: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు రాయలనుకునే వారు సకాలంలో దరఖాస్తులు చేసుకోవాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఓపెన్ టెన్త్ పరీక్ష రాయాలనుకునే వారికి 14ఏళ్ల వయస్సు, ఇంటర్ వారికి 15ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఫీజులు చెల్లించి ప్రతి ఆదివారం మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో జరిగే ప్రత్యేక తరగతులకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలు మాత్రం జిల్లా కేంద్రంలో రాయాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని బడిమానిన వారు, విద్యపై ఆసక్తి ఉన్న వారు వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



నూతన కమిటీ సభ్యులతో చిన్నారెడ్డి

గోపాల్‌పేట: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేయాలని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. గురువారం ఉదయం నుంచి మండల వ్యాప్తంగా నూతన కమిటీలు నియమించారు. మున్ననూరు, జయన్న తిర్మలాపూర్, చెన్నూర్, చెన్నూరు తండాలు ధర్మాతండా, పాటిగడ్డతండా, లక్ష్మీతండా, జంప్లాతండా, బుద్ధారం గ్రామంలో కమిటీలు ఎన్నుకున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కమిటీ సభ్యులకు చిన్నారెడ్డి సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్లరవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొంకి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



పెద్ద పీర్ల మసీదులో కొలువుదీరిన పీర్లు

అమరచింత: మొహర్రం పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పీర్ల మసీదులతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడీల్లో గురువారం ఆలంలు కొలువుదీరాయి. బుధవారం సాయంత్రం పీర్ల పెట్టెలను భక్తిశ్రద్ధలతో కిందికి తీసుకొచ్చిన మసీదుల నిర్వాహకులు గురువారం ఆలంలను అలంకరించి మసీదుల్లో ప్రతిష్ఠించారు. మొహర్రం పది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆలంలను పూజించి చివరి రోజున నిమజ్జనానికి తరలించడం ఆనవాయితీ. పట్టణంలో ఆలంలను ఏర్పాటు చేసిన ఐదో రోజు నుంచి ప్రతి నిత్యం ఒక ఆలంను నిమజ్జనానికి తరలిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. మొహర్రం ఐదో రోజున తానే అబ్దుల్లా ఆలంను, ఆరో రోజు అబ్బసలీ ఆలం, ఏడో రోజు ఇమామే ఖాసీం, ఎనిమిదో రోజు అలీ అక్బర్, తొమ్మిదో రోజు ఇమామే హుస్సేన్ ఆలం సవారీతో పీర్ల పండుగ ముగుస్తుందని పట్టణ జామీయా మసీద్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో గల 100ఏళ్ల చరిత్ర కలిగిన నాగుల దేవత గుడిని అభివృద్ధి చేయాలని హిందూ వాహిని జిల్లా కన్వీనర్ అభిలాష్ కోరారు. గురువారం హిందూ వాహిని పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ.. వనపర్తి సంస్థానాధీశులు రాజారామేశ్వర్‌రావు హయాంలో వనపర్తి, ప్రజల సంరక్షణకు నాగుల దేవత ఆలయాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో అరవింద్, నరేష్‌గౌడ్, రోహిత్, నంద పాల్గొన్నారు.

బీజేపీతోనే సంక్షేమ ఫలాలు



కొర్లకుంటలో కేంద్ర పథకాలపై ప్రచారం చేస్తున్న నాయకులు

పాన్‌గల్: బీజేపీతోనే పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని నాయకులు అన్నారు. గడప, గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గోప్లాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు అన్వేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కరపత్రాలను పంపిణీ చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో సుధాకర్‌రావు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జగన్‌గుప్తా, మధుసూదన్‌యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల వారికి అందిస్తున్న పలు అభివృద్ధి పథకాలను గురువారం బీజేవైఎం నాయకులు కొర్లకుంటలో విస్తృతంగా ప్రచారం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు నాయకత్వంలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్, రేషన్ షాపుల ద్వారా అందుతున్న ఉచిత బియ్యం, మోదీ ప్రభుత్వం అందిస్తున్న రైతులకు ఆర్థికసాయం, తదితర అంశాలపై ప్రజలు వివరించినట్లు బిజేపీ నాయకులు ఆవుల నారాయణ, మహేష్ యాదవ్, రాకేష్, ప్రసాద్‌గౌడ్ తెలిపారు.

స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పెబ్బేరు రూరల్: స్వీపర్లకు కనీస వేతన చట్టం ప్రకారం రూ.27,000 ఇస్తూ, ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ స్వీపర్ల జిల్లా అధ్యక్షుడు ఖాజాపాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం సమీపంలో జోరువానలో తడుస్తూనే రిలే దీక్షలు నినాదాలతో స్వీపర్ల హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లలో కొందరికి జీతం రూ.1,623, మరికొంత మందికి రూ.4వేలు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసరా పింఛన్లు వృద్ధులకు రూ.2వేలు, దివ్యాంగులకు రూ.4వేలు ఇస్తున్నారని, వారికంటే తమ జీతం చాలా తక్కువని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, నాయకులు బాలస్వామి, కురుమన్న, గీత, రషీద్, ఖయ్యూం పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయ రోడ్డు పనుల పరిశీలన



పెబ్బేరు: మండలంలోని పాతపల్లిలో వెలసిన చింతలకుంట ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను గురువారం పంచాయతీ రాజ్ అధికారులు పరిశీలించారు. కొల్లాపూర్ ప్రధాన రోడ్డు నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు బీటీ రోడ్డుకు నిర్మాణానికి రూ. 2.10 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. దీంతో ఎక్కడ కల్వర్టులు, సీసీ రోడ్డు వేయాలని అంచనా కోసం అధికారులు రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ మల్లయ్య, డీఈఈ అశోక్, ఏఈఈ రమేష్‌నాయుడు, సర్పంచ్ రవీందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు గురువారం టీచర్లు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముసురు వర్షాల కారణంగా వరుసగా రెండు రోజులు సెలవులు ప్రకటించడంతో చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, సువర్ణ, కమల, ఎల్లమ్మ, మహేశ్వరి, మాధవి, చంద్రకళ, లక్ష్మీదేవి, కృష్ణమ్మ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు గుడ్లు, పప్పు, నూనె, బియ్యం, పాలు అందజేసినట్లు వారు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు: మండలంలోని వై శాఖాపూర్‌కు చెందిన పింజరి ఉషేన్ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబానికి గురువారం మేఘారెడ్డి రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన పింజరి ఉషేన్ కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయాన్ని మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి వెంటనే రూ. 5 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య, రామకృష్ణ, లక్ష్మయ్య, మధు, శివశంకర్, భరత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ



మదనాపురం: తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెషన్ పరీక్ష తర్వాత వారికి సర్టిఫికెట్లు అందజేసారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులు సరిదిద్దడం, కొత్తగా నమోదు వంటివి సమర్థవంతంగా చేయాలనీ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, బీఎల్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామిని బీఆర్ఎస్ నాయకుడు వంగూర్ ప్రమోద్‌రెడ్డి మండల నాయకులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు వారికి స్వాగతం పలికి రంగనాథుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చకులు ఆలయ విశిష్టతను తెలియజేసి, తీర్థ ప్రసాదాలు అదించడంతో పాటు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పృథ్వీరాజు, ఎల్లారెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో గురువారం మత్స్య సహకార సఘం నూతన కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్షుడిగా సొప్పరి వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా మేకల నరేష్, ప్రధాన కార్యదర్శిగా బొల్లెద్దుల ఆంజనేయులు, కోశాధికారిగా గొడుగు ఎల్లస్వామి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తాన్నారు.